ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
సోమవారం 3 మార్చి 2025

దబ్బచిక్కుడు ధరలు పతనం





అడిగేనాథుడే లేడు

చెన్నై మార్కెట్‌కు వెళ్లినా గిట్టుబాటు లేదు.. ఆందోళనలో రైతులు

పంట పండితే ధర ఉండదు.. ధర ఉన్నప్పుడు పంట పండదు.. ఇదీ కూరగాయల రైతుల పరిస్థితి. దీంతో సాగు చేసిన పంటను పొలాల్లోనే వదిలి వేయాల్సిన దయనీయ స్థితి ఏర్పడింది. రెండు వారాల క్రితం వరకు మార్కెట్‌లో బాగా పలికిన దబ్బచిక్కుడు ధరలు ధమాల్‌మని పడిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తనకల్లు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక పొలాల్లోనే వదిలి వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తనకల్లు మండలంలోని వివిధ గ్రామాల్లో చెన్నై మార్కెట్ మీద ఆధార పడి రైతులు దబ్బచిక్కుడు పంటను 1500 ఎకరాలకుపైగా సాగుచేశారు. పంట సాగుచేయడానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పేపర్, కూలీలు, తదితర వాటి కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. ఎకరా పంట సాగుచేయడానికి రూ.80వేల నుంచి రూ.లక్ష 50వేల దాకా రైతులు ఖర్చు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో దబ్బచిక్కుడు ధరలు పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పొలాల్లోనే వదిలి వేస్తున్నారు. ఒక్కో కూలీకి రూ.350 నుంచి రూ.400 వరకు చెల్లించాల్సి వస్తోంది.

వీటిని సంచులకు ఎత్తి కిలోకు రూ.3.50 చెల్లించి చెన్నై మార్కెట్‌కు తరలిస్తే.. అక్కడ అడిగేనాథుడే లేక మార్కెట్‌లోనే వదిలివేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు వారాల క్రితం చెన్నై మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.70 వరకూ పలికిన ధరలు.. ప్రస్తుతం రూ.15- 20కి పడిపోయాయని రైతులు తెలిపారు. కూలీలు, రవాణా ఖర్చులు, మండీ కమీషన్లు పోనూ తమకు ఆరోజు కూలి కూడా గిట్టుబాటు కాలేదని రైతులు చెబుతున్నారు. మండలంలో దబ్బచిక్కుడు సాగుతోనే రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్ల నష్టం వాటిల్లినట్లు రైతులు లెక్కలేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కౌలుకు తీసుకుని సాగు చేశా



పాపాగ్ని నది పరివాహక ప్రాంతంలో మాగ్రామ సమీపంలో మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని దబ్బచిక్కుడు సాగుచేశాను. పంట సాగు చేయడానికి రూ.4 లక్షలు ఖర్చు చేశాను. ప్రారంభంలో రెండుకోతలు కిలో రూ.70 పలికింది. ప్రసుత్తం అడిగేనాథుడే లేక మార్కెట్లో వదిలి వేయాల్సి వస్తోంది. ఒక్క కోతకు 50 మూటలు దాకా దిగుబడి వస్తోంది. కూలీల ఖర్చులు కూడా రావడంలేదు. ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆదుకోవాలి. **- శంకర్‌నాయక్, రైతు, మొగిలిచెట్లతండా**

అప్పుచేసి సాగుచేస్తే.. అప్పులే మిగిలాయి



అప్పులు చేసి దబ్బచిక్కుడు పంట సాగు చేశా. దిగుబడి బాగా వచ్చింది. పంట కోసం చేసిన అప్పులు తీరి అంతో ఇంతో మిగులుతుందని ఆశించా. మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో అప్పులే మిగిలాయి. పంటను పొలాల్లోనే వదిలేయాల్సి వస్తోంది. ప్రభుత్వం టమాట రైతులను ఆదుకున్నట్లు దబ్బచిక్కుడు రైతులను కూడా ఆదుకోవాలి.

-చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, పెద్దపల్లి



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న నాటిక

పుట్టపర్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సత్యసాయి యూత్ బృందం చేపట్టిన కర్ణనాటిక భక్తులను అలరించింది. రెండోరోజు ఆదివారం సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో ఆదిలాబాద్ భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సాయియూత్ కర్మ పేరిట నాటికను ప్రదర్శించారు. కర్మసిద్ధాంతాన్ని తెలియజేస్తూ పురాణాల్లోని పలుఘట్టాలను వివరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నాటికలోని సన్నివేశం

ఉష్ణోగ్రతలు



గరిష్ఠం	35.0
కనిష్ఠం	22.0

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత
- జాబ్‌మేళాకు విశేష స్పందన

వివరాలు 7లో





	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.31 సోమవారం సాయంత్రం	5.13 మంగళవారం ఉదయం
కదిరి	6.29 సోమవారం సాయంత్రం	5.17 మంగళవారం ఉదయం
ధర్మవరం	6.31 సోమవారం సాయంత్రం	5.13 మంగళవారం ఉదయం
హిందూపురం	6.34 సోమవారం సాయంత్రం	5.12 మంగళవారం ఉదయం
పెనుకొండ	6.34 సోమవారం సాయంత్రం	5.12 మంగళవారం ఉదయం

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



అరటి ఎగుమతులను మరింత ప్రోత్సహిస్తాం

ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ దేవమునిరెడ్డి

యూరప్ కంపెనీ ప్రతినిధితో కలిసి పలుచోట్ల పరిశీలన

7లో

కోనేటి స్నానం లేనట్లే?

సుందరీకరణ పేరుతో రూ.కోట్లు దుర్వినియోగం

కూటమి ప్రభుత్వంలో దిద్దుబాటు చర్యలు

సమయం లేకపోవడంతో తాత్కాలిక ఏర్పాట్లు

9 నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు



కదిరి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో కూడా లక్ష్మీనరసింహ స్వామి భక్తులకు కోనేటి స్నానం లేనట్లేనని కదిరి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ వైఫల్యంతో నాలుగేళ్లుగా నరసింహస్వామి భక్తులకు కోనేటి స్నానం కరువైయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. సుందరీకరణ పేరుతో గత పాలకులు రూ. కోట్లు ఖర్చు పెట్టిన కోనేటి నిర్మాణం పూర్తి కాలేదు. వచ్చే సంవత్సరానికి వాస్తుతోపాటు ఇతర సాంకేతికాంశాలు పరిగణనలోకి తీసుకుని కోనేరును పూర్తిస్థాయిలో నిర్మిస్తామని ఇటీవల జరిగిన బ్రహ్మోత్సవాల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట ప్రకటించారు. అయితే భక్తులకు అసౌకర్యం కలగకుండా తాత్కాక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

కోనేరు సుందరీకరణ పేరుతో స్వామి సొమ్ము దుర్వినియోగం

గతంలో వైసీపీ అధికారంలోకి రాగానే కోనేరును సుందరీకరణ చేస్తామని ప్రకటించారు. 2021లో కోనేటి పునర్నిర్మిణ పనులు చేపట్టారు. అయితే ప్రారంభించిన కొన్ని నెలలకే వరద రావడంతో కోనేటిలో చేపట్టిన నిర్మాణాలు కొట్టుకుపోయాయి. అప్పటికే రూ. నాలుగు కోట్లు ఖర్చు పెట్టేశారు. అయినా కోనేరు ఎంతమాత్రం భక్తులకు ఉపయోగపడలేదు. పక్కనే ఉన్న మురుగు కాలువ నీరు కోనేటిలోకి ఊటగా ప్రవహిస్తోంది. దీంతో కోనురు భరించలేని కంపకొడుతోంది. కోనేటిలోకి వస్తున్న మురుగు నీటికి అడ్డుకట్ట వేయడానికి రూ. 2కోట్లతో పనులు చేపట్టారు. ఈలోపు వైసీపీ ప్రభుత్వం కాలం ముగిసింది. కోనేటి నిర్మాణం ఆగిపోయింది. సుందరీకరణ పేరుతో గత ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి పెద్ద నీటి సంపు నిర్మించిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మాదిరి కోనేటిని నిర్మించారన్నవిమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాలేని నాయకులు శ్రీవారి సొమ్ము రూ. ఆరుకోట్లు ఎలా ఖర్చు పెడతారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దిద్దుబాటు దిశగా..

అర్ధంతరంగా ఆగిపోయిన కోనేటి నిర్మాణం పూర్తి చేయడానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చర్యలు తీసుకున్నారు. కేంద్రం ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి సంస్కృతిక ప్రచార్ అనే కార్యక్రమంలో భాగంగా నిధులు విడుదల చేస్తోంది.

ఈక్రమంలోనే ఎమ్మెల్యే కేంద్ర సాంస్కృతిక శాఖమంత్రిని కలిసి ప్రచార్ పథకంలో భాగంగా కదిరి నరసింహస్వామి ఆలయానికి నిధులు కేటాయించాలని కోరారు. దాదాపు రూ. 50కోట్లకుపైగా నిధులు విడుదలయ్యే అవకాశమున్నట్లు ఇటీవల ఎమ్మెల్యే ప్రకటించారు. నిధులు విడుదలైతే తిరువీధులను వెడల్పు చేయడం, భక్తులకు వసతి సౌకర్యం మెరుగు పరచడంతో పాటు ఆలయాభివృద్ధికి కావలసిన ఇతర చర్యలు చేపడతామని ప్రకటించారు. అందులో భాగంగా కోనేటి పునర్నిర్మాణం కొనసాగుతుందని చెప్పారు.

తాత్కాలిక ఏర్పాట్లు

కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 9నుంచి 23వరకు జరగనున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారి జరుగుతున్న బ్రహ్మోత్సవాను పెద్ద ఎత్తున నిర్వహించాలని, పాలకులు,, అధికారులు నిర్ణయించారు. కోనేరు అసంపూర్తిగా ఉండటంతో ప్రస్తుతం స్వామి వారి చక్రస్నానం చేయడానికి తీర్థవాది రోజుకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని అధికారులు నిర్ణయించారు. కోనేరును శుభ్రం చేసి, అందులోకి నీరు వదిలి 15రోజులపాటు శుభ్రంగా ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. వైసీపీ పాలకులు చేసిన నిర్వాకంతో నాలుగు సంవత్సరాల పాటు కోనేటి స్నానం దూరమైందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మృత్యువులోనూ తోడుగా తోబుట్టువులు..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతి

ఓ చిన్నారి కూడా.. అదే కుటుంబంలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు

7లో

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

రాష్ట్రపతి భవన్ నుంచి

చేనేత డిజైనర్‌కు ఆహ్వానం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మృత్యువులోనూ తోడుగా తోబుట్టువులు..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతి


సరస్వతి, నీలావతి, యోగేశ్వరమ్మ, చిన్నారి విద్యశ్రీ (ఫైల్)

ఓ చిన్నారి కూడా..

అదే కుటుంబంలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నలుగురు అక్కాచెల్లెళ్లు..
ప్రేమానురాగాలతో పెరిగారు..
పెళ్లిళ్లయ్యాయి.. పిల్లలూ కలిగారు..
చిన్న చెల్లి.. కాన్పు అయింది..
పండంటి ఆడబిడ్డతో అత్తారింటికి
బయల్దేరింది..
అక్కలూ వచ్చారు..
చెల్లికి దుస్తులు పెట్టి..
పుట్టింట్లో అందరూ
ఆనందంగా గడిపారు..
చెల్లి ఆటోలో పయనమైంది..
అక్కలు కూడా వెంట వెళ్లారు..
పిల్లలతో కలిసి..
కబుర్లు చెప్పుకుంటూ..
సాగిపోతున్నారు..
మృత్యువు
కారు రూపంలో దూసుకొచ్చింది..
అతివేగంగా ఢీకొట్టడంతో
చెల్లాచెదురుగా పడిపోయారు..
అత్తారింటికి బయల్దేరిన చెల్లి..
అక్కడే కన్నుమూసింది..
ఆమె మూడు నెలల పసిబిడ్డ,
ఇద్దరు అక్కలు
ప్రాణాలు కోల్పోయారు..
తోబుట్టువులు ముగ్గురూ
కన్నుమూయడంతో
ఆయా కుటుంబాల్లో
విషాదఛాయలు
అలుముకున్నాయి..
వారి పిల్లలు ఆస్పత్రి
పాలయ్యారు..

కూడేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై ఆదివారం మధ్యాహ్నం కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో అక్కచెల్లెళ్లు సరస్వతి (34), నీలావతి(45), యోగేశ్వరమ్మ (40) మృతిచెందారు. సరస్వతి మూడు నెలల కుమార్తె విద్యశ్రీ కుడా మరణించింది. యోగేశ్వరమ్మ రెండేళ్ల కుమార్తె జ్ఞానేశ్వరి, నీలావతి కుమారుడు అచ్యుత్‌కుమార్, ఆటోడ్రైవర్ లోకేశ్ తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కారులోని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. కూడేరు అప్‌గ్రేడ్ సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన బసవరాజు, పార్వతమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె పుష్పావతిని మర్తాడుకే చెందిన వ్యక్తికిచ్చి వివాహం చేశారు. రెండో కుమార్తె నీలావతిని అనంతపురం జిల్లా కుందుర్పి మండలం అప్పిలేపల్లికి చెందిన శ్రీకంఠకిచ్చి పెళ్లి చేశారు. ప్రస్తుతం వీరు జిల్లాలోని బుక్కరాయసముద్రం మండలం వడియంపేటలో నివాసముంటున్నారు. వీరికి అచ్యుత్‌కుమార్ సంతానం. మూడో కుమార్తె యోగేశ్వరమ్మకు జిల్లాలోని కణేకల్లు మండలం పులిచెర్లకు చెందిన మహాబలేశ్వరప్పతో వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమార్తె జ్ఞానేశ్వరి సంతానం. నాలుగో కుమార్తె సరస్వతికి జిల్లాలోని ఉరవకొండ మండలం రాయంపల్లికి చెందిన సతీష్‌కుమార్‌తో వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమార్తె జ్యోత్స్న ఉంది. సతీష్‌కుమార్ వంట పనులకు వెళ్తుండేవాడు. ఓ మినీ బ్యాంకులో పనిచేస్తుండేవాడు. సరస్వతి కాన్పు నిమిత్తం పుట్టింటికి వచ్చింది. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ విద్యశ్రీకి మూడు నెలలు నిండడంతో అత్తారింటికి బయల్దేరేందుకు సిద్ధమైంది. సరస్వతి తండ్రి బసవరాజు గతంలోనే మరణించాడు. తల్లి పార్వతమ్మ.. బిడ్డకు ఏలోటూ రాకుండా చూసుకుంది. ఆదివారం సరస్వతికి దుస్తులు పెట్టింది. కార్యక్రమానికి సరస్వతి అక్కలు హాజరయ్యారు. అందరూ ఆనందంగా గడిపారు. అనంతరం లోకేశ్‌కు చెందిన ఆటోలో రాయంపల్లికి బయల్దేరారు. యోగేశ్వరమ్మ రెండేళ్ల కుమార్తె జ్ఞానేశ్వరితో కలిసి ఆటోలో ఉరవకొండ వెళ్లి అటు నుంచి అత్తగారి ఊరైన పులిచెర్లకు వెళ్దామని బయల్దేరింది. నీలావతి కూడా చెల్లిని వదిలిపెట్టి వద్దామని ఆటోలో కుమారుడు అచ్యుత్‌కుమార్‌తో కలిసి బయల్దేరింది.




ప్రమాదంలో నుజ్జయిన ఆటో, విషాదంలో సరస్వతి భర్త సతీష్‌కుమార్

దూసుకొచ్చిన మృత్యువు

అక్కచెల్లెళ్లు ఆనందంగా పిల్లలతో పయనమయ్యారు. కూడేరు మండలం కమ్మూరు క్రాస్ సమీపంలోకి రాగానే మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చింది. ఉరవకొండ వైపు నుంచి అనంతపురం వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. అందులోని సరస్వతి అక్కడికక్కడే మృతిచెందింది. మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ రాజు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను తన వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మూడు నెలల చిన్నారి విద్యశ్రీతోపాటు నీలావతి, యోగేశ్వరమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆటో డ్రైవర్ లోకేశ్, అచ్యుత్‌కుమార్, చిన్నారి జ్ఞానేశ్వరి చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి పెద్దఎత్తున చేరుకున్నారు. మార్చురీలో విగత జీవులుగా పడి ఉన్న తమ వారిని చూసి బోరున విలపించారు. భార్య సరస్వతి, కుమార్తె విద్యశ్రీ మరణించడంతో సతీష్‌కుమార్ కన్నీరు పెట్టుకున్నాడు. మూడు నెలలకే వందేళ్లు నిండాయా తల్లీ అంటూ బిడ్డను చూసి కన్నీరుమున్నీరుగా విలపించాడు. కారులో ఇంజనీరింగ్ విద్యార్థులు కావ్య, కవిత, రంజిత్, యశ్వంత్, తరుణ్ ప్రయాణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో కావ్య, కవిత, రంజిత్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రమాద స్థలాన్ని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు.

నీటిగుంతలో పడి చిన్నారి మృతి


గౌతమ్ నంద మృతదేహం

తాడిపత్రి, మార్చి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపాన నల్లబండల ఫ్యాక్టరీలో చిన్నారి గౌతమ్ నంద (3) ఆదివారం ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పామిడికి చెందిన గంగరాజు, దీవెన దంపతులకు కుమారుడు గౌతమ్‌నంద, కుమార్తె ఉన్నారు. వీరు శివరాత్రి పండుగ సందర్భంగా చుక్కలూరు సమీపంలోని బండల ఫ్యాక్టరీలో పనిచేసుకుంటున్న గంగరాజు మేనమామ రామాంజనేయులు ఇంటికొచ్చారు. పండుగ ఆనందంగా చేసుకున్నారు. అందరూ సంతోషంగా ఉన్న సమయంలో ఆదివారం మధ్యాహ్నం గౌతమ్‌నంద ఆడుకుంటూ వెళ్లి నీటిగుంతలో పడ్డాడు. తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా కనిపించలేదు. అనుమానం వచ్చి నీటిగుంతలో చూడగా అందులో కనిపించాడు. బయటకు తీసి హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


ప్రేమసాయి (ఫైల్)

నల్లమాడ, మార్చి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేళ్లమద్ది గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి ప్రేమసాయి (20) పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రేమసాయి చిత్తూరులో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుండేవాడు. ఐదురోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆదివారం నొప్పి ఎక్కువగా రావడంతో మనస్తాపం చెంది పొలానికి వెళ్లి పురుగు మందు తాగి, అపస్మారక స్థితిలో పడిపోయాడు. కాసేపటికి గుర్తించిన తండ్రి వెంకటపతి.. ప్రేమసాయిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. వెంకటపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తొలి పూజలందుకున్న పోతలయ్య స్వామి

దర్శించుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


ప్రత్యేకాలంకరణలో పోతలయ్యస్వామి

కనగానపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదులూరులో వెలిసిన పోతలయ్య స్వామి తొలి పూజలందుకోవడంతో దాదాలూరు పరుష ప్రారంభమైంది. కలికవాండ్లపల్లికి చెందిన బీజారీ వంశీకులు ఆదివారం యలవగంపలో ఆభరణాలు, పూలను తీసుకొచ్చి పోతలయ్యస్వామికి సమర్పించారు. పోతురాజులు నృత్యం చేస్తూ యలవగంపను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించి పూజలు చేశారు. సోమవారం జ్యోతులు, పలహారపుబండ్లతో ఆలయ ప్రదక్షిణ చేస్తారు. మంగళవారం పోతురాజులు నల్లని మేకపిల్లను గావులు పట్టి స్వామికి నైవేద్యంగా సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాదులూరు గ్రామానికి వచ్చిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా చెన్నకేశవ స్వామిని, అనంతరం పోతలయ్య, బంగారు లింగమయ్య స్వాములను దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి, పోతలయ్య, రాజప్ప, బాలు, వెంకటరాముడు, ఆదెప్ప, ప్రసాద్, ఓబులేష్, రవి, లింగమయ్య పాల్గొన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

టమోటా కిలో రూ.9



అనంతపురం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.9తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 300 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత
- జాబ్‌మేళాకు విశేష స్పందన


మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లోనూ మహిళలు ముందుండాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. టీడీపీ హయాంలోనే మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ట్రైనీ టైలర్, ఆపరేటర్లుగా అవకాశాలు కల్పించామని అన్నారు. ట్రైనింగ్‌లో వారికి గౌరవవేతనం ఇస్తారన్నారు. 500 మంది దాకా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో చిన్నవెంకటరాముడు, కేశవయ్య, సూరి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, శ్రీరాములు, సిద్దయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల వద్ద ముళ్ల కంపలో 35 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని కసాపురం పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడని వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అరటి ఎగుమతులను మరింత ప్రోత్సహిస్తాం

ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ దేవమునిరెడ్డి

యూరప్ కంపెనీ ప్రతినిధితో కలిసి పలుచోట్ల పరిశీలన


అరటి పంటను పరిశీలిస్తున్న దేవమునిరెడ్డి, యూరప్ ప్రతినిధి పాట్రిక్

అనంతపురం అర్బన్/రాప్తాడు/పుట్లూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి అరటి ఎగుమతులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ దేవమునిరెడ్డి పేర్కొన్నారు. యూరోప్ దేశానికి చెందిన ఫెయిర్‌ట్రాసా కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాట్రిక్ స్ట్రూబితో కలిసి ఆయన ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అరటి పంట సాగు, ఎగుమతి పద్ధతులపై ఆరా తీశారు. రాప్తాడు మండలం రామినేపల్లిలోని అరటి టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను సందర్శించారు. ల్యాబ్‌లో ఉత్పత్తి చేస్తున్న అరటి మొక్కల వివరాలపై ఆరా తీశారు. అనంతరం పుట్లూరు మండలం కడవకల్లులో ఎస్కే బనానా కంపెనీ ఆధ్వర్యంలో అరటి గెలల సేకరణ, ప్యాకింగ్‌ను పరిశీలించారు. అరటి తోటల నుంచి గెలలు ఎలా సేకరిస్తున్నారు, వాటిని 13కిలోలు, 7కిలోల బాక్సుల్లో ప్యాకింగ్ ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఫ్రూట్‌కేర్ భాగంగా అరటిగెలలను అధిక సూర్యరశ్మి, దుమ్ము పురుగుల తాకిడి నుంచి అరికట్టడానికి రైతులు పాటిస్తున్న కవర్ల వినియోగాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత తాడిపత్రి మండలం చుక్కలూరులో కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌ను సందర్శించారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వారిని కలిసి పలు అంశాలపై చర్చించారు. తాడిపత్రి, అనంతపురంలోని పలు ప్రాంతాల నుంచి అరటి, దానిమ్మ ఉత్పత్తులను యూరప్ దేశాలకు ఎగుమతులను ప్రోత్సహించేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నరసింహారావు, హెచ్‌ఓలు రత్నకుమార్, శైలజ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల వాగ్వాదం

ఉరవకొండలో బయట పడ్డ విభేదాలు


వాగ్వాదానికి దిగిన బీజేపీ నాయకులు

ఉరవకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వ కర్మ ట్రైనింగ్ సెంటర్ విషయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకరినొకరు నువ్వెంత అంటే నువ్వెంతనే స్థాయిలో గొడవపడ్డారు. దీంతో అక్కడ గందరగోళం ఏర్పడింది. స్థానిక మహాత్మ జూనియర్ కళాశాలలో పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద చేతి వృత్తుల వారికి గత 15 రోజుల నుంచి శిక్షణ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ వెళ్లారు. శిక్షణ పొందేవారికి సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని నిర్వాహకులపై రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నువ్వెందుకు వచ్చావని జిల్లా అధ్యక్షుడిని నిలదీశారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడున్న బీజేపీ నాయకులు ఇద్దరికి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. గత కొంత కాలంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మధ్య అంతర్గత విభేదాలు ఉన్నాయి. ఈ సంఘటనతో ఉరవకొండ బీజేపీలో వర్గ విభేదాలు బయటపడ్డాయి.

రాష్ట్రపతి భవన్ నుంచి చేనేత డిజైనర్‌కు ఆహ్వానం


నాగరాజు

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం వచ్చినట్టు ధర్మవరం పట్టణానికి చెందిన డిజైనర్, చేనేత కార్మికుడు నాగరాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేనేతకు ప్రోత్సాహం కల్పించడానికి అమృత్ మహోత్సవంలో భాగంగా ధర్మవరం పట్టుచీరల ప్రదర్శన కోసం రాష్ట్రపతి భవన్ నుంచి ఎక్స్‌పో నిర్వహణకు ఆదివారం ఆహ్వానం పంపించారని నాగరాజు తెలిపారు. గత ఏడాది ఆగస్టు 15న గవర్నర్ విందుకు ఆహ్వానం పంపగా హాజరయ్యానని పేర్కొన్నారు. దేశ రాజధానిలో ధర్మవరం పట్టుచీరల ప్రత్యేకతను తెలియజేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. రాష్ట్రపతిభవన్‌కు తనతోపాటు చేనేత కార్మికుడు చిప్పల మార్కండేయ రానున్నట్లు వివరించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో శివతేజ సత్తా


బెంగుళూరు పోటీల్లో పాల్గొన్న శివతేజ

అనంతపురం టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బాడీ బిల్డింగ్ పోటీల్లో అనంత యువకుడు చారుగుండ్ల శివతేజ సత్తా చాటాడు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పతకాలు సాధించాడు. ఆదివారం బెంగళూరులోని శంకర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఎన్‌బీఎఫ్ఎఫ్ క్లాసిక్ ఆధ్వర్యంలో మిస్టర్ ఇండియా పోటీలు సాగాయి. ఈ పోటీల్లో శివతేజ పాల్గొని వివిధ రాష్ట్రాల బాడీ బిల్డర్లతో పోటీపడి సత్తా చాటాడు. మెన్ ఫిజిక్ 175 సెంటీ మీటర్ల విభాగంలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్‌మెడల్ సాధించాడు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు


మాట్లాడుతున్న కేఆర్ సూర్యనారాయణ

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఆదివారం ప్రథమ కౌన్సిల్ మహాసభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, రమేశ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఫోన్‌ద్వారా తన సందేశాన్ని ఉద్యోగులకు వినిపిస్తూ.. ఉద్యోగుల పక్షాన కూటమి ప్రభుత్వం ఉంటుందన్నారు. ఉద్యోగుల సమస్యలను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి దృష్టికి తీసుకురాగా తక్షణమే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ... పీఆర్‌సీపై ప్రభుత్వం తక్షణమే జ్యూడిషియల్ పే కమిషన్ ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఆలస్యమైన దృష్ట్యా ఐఆర్ ప్రకటించాలని, సరెండర్ లీవులు, జీపీఎఫ్ లోన్ల ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే ఒక్క డీఏ విడుదల చేయాలన్నారు. మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఎఫ్ఆర్‌సీ, పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మూడు దశాబ్దాలుగా ఉన్న ఉపాధ్యాయుల ఏకీకృత సమస్యకు తక్షణం పరిష్కారం చూపాలన్నారు. సీపీఎస్ సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘాల నాయకులు పఠాన్ బాజి, అబ్దుల్‌రజాక్, కేదారనాథ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఓబుళదేవరచెరువు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతులు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ నరేంద్రరెడ్డి సూచించారు. ఆదివారం అమడగూరు మండలంలోని నిలువురాతి పల్లిలో వరస చోరీలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విలువైన ఆభరణాలు, వస్తువులు ధరించి బయటకు వెళ్లరాదన్నారు. ఊళ్లకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులు ఇంటి లో పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు రామాంజనేయనాయుడు, పోలీస్‌సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

● గాండ్లపెంట : మండలంలోని వేపరాల, తూపల్లి పంచాయతీల్లో మహిళలకు ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు నిర్వహించారు. ఇటీవల రహదారుల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారని, కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనుమానిత వ్యక్తులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తంగా ఉండాలని, ఫోన్లకు వచ్చే ఓటీపీ నెంబర్లు ఎవరికి చెప్పకూడదన్నారు. ఇందులో పోలీసులు భాస్కర్, శ్రీనివాసులు, బాషా, గురుప్రసాద్ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర, బీమా కల్పించాలి

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధర, బీమా సౌకర్యం కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌హెచ్‌బాషా కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. హంద్రీనీవా కాలువలను వెడల్పు చేసి.. అన్ని చెరువులకు నీటిని సరఫరా చేయాలని, గ్రీన్‌ఎనర్జీ కారిడార్ పేరిట సేకరిస్తున్న రైతుల భూములను నిలుపుదల చేయాలని, సాగులో ఉన్న వారికి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కంటి ఆపరేషన్‌కు 42 మంది ఎంపిక

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 42 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, సెక్రటరీ జయరాం తెలిపారు. ఈ వైద్యశిబిరంలో 119 మందికి బెంగుళూర్ లయన్స్ ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ఓబుళదేవరచెరువు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ద్విచక్రవాహనదారుడు, బైక్ వెనక కూర్చున్న వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, లేకుంటే ఫైన్ తప్పదని ఎస్‌ఐ బి. మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. ఆదివారం కొండకమర్ల సర్కిల్‌లో ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. లైసెన్సు, వాహన బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆయన వెంట జమేదార్లు వెంకటేష్, కరుణాకర్‌రెడ్డి, బాబ్‌జాన్, కోలా అంజి ఉన్నారు.

● ధర్మవరంరూరల్: వాహనదారులు నూతనంగా వచ్చిన ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని కుణుతూరు గ్రామసమీపంలో వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకపోతే రూ.1000, వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోయినా రూ.1000, వాహనానికి బీమా లేకపోతే రూ.1000, డ్రైవింగ్ లైసెన్సు లేకపోతే రూ.10000, పొగ, కాలుష్యం చేస్తే 2000-4000 వేలు, మైనర్లు వాహనాలు నడిపితే రూ.1000, ఓవర్‌స్పీడ్ రూ.5000 జరిమానా విధిస్తామన్నారు.

చేనేతకు రాష్ట్ర బడ్జెట్‌లో అన్యాయం

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమకు రాష్ట్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బడాపెట్టుబడిదారులకు పరిశ్రమ పెట్టుకుని రూ.1000 నుంచి రూ.10వేల వరకు ఉపాధి కల్పిస్తారని వారికి రూ. వేలకోట్లను రాయితీల పేరుతో దోచిపెడుతున్నారన్నారు. లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తున్న చేనేత పరిశ్రమకు బడ్జెట్‌లో కేవలం రూ.115.70 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. ఎనిమిదేళ్లుగా సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాలని బకాయిలు యారన్‌సబ్సిడీ, పావలావడ్డీ, రిబేటు, త్రిఫ్టుఫండ్, మార్కెట్ ఇన్సెట్ బకాయిలు చెల్లించే ఊసే బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. కర్నూల్ జిల్లాలో చేనేత కార్మికసంఘం విస్తృతస్థాయి సమావేశాన్ని ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇలా ఉంటే రోగాలు రావా?

ఓబుళదేవరచెరువు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పారిశుధ్యాన్ని పంచాయతీ అధికారులు, పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కదిరి - హిందూపురం ప్రధాన రహదారి వద్దనే మురుగునీరు నిల్వ ఉంటోంది. చెత్త పేరుకుపోయి ఉంటోంది. దీంతో దోమలు విపరీతంగా పెరగడంతో.. స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. పందులు ఆ చెత్త కోసం రోడ్లపై అటు.. ఇటు తిరుగుతుండటంతో వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



స్టేట్‌బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న పందులు

రోడ్డుపైకి ఎలుగుబంటి

రాయదుర్గం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని రాజీవ్ గాంధీ కాలనీ వద్ద రోడ్డుపై రెండ్రోజులుగా ఎలుగుబంటి హల్‌చల్ చేస్తోంది. శనివారం రాత్రి ద్విచక్రవాహనదారులకు ఎలుగుబంటి కనిపించడంతో భయాందోళన చెందారు. సమీపంలో వున్న కురాకుల గుట్ట నుంచి వచ్చి రోడ్డు మీద సంచరిస్తున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఆదివారం పగలే రోడ్డుపైకి రావడంతో పరిసర ప్రాంత ప్రజలు పరుగులు పెట్టారు. అరగంటపాటు రోడ్డుపై సంచరించిన ఎలుగుబంటి తర్వాత గుట్టల్లోకి వెళ్లిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు కొండ ప్రాంతాన్ని పరిశీలించి, కాలనీ వాసులకు పలు సూచనలు ఇచ్చారు.



రోడ్డుపై సంచరిస్తున్న ఎలుగుబంటి

అంజన్న వైభవం

కుందుర్పి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డీపాలెం గ్రామంలో వెలిసిన గుడిబండ ఆంజనేయస్వామి రథోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. 11 గంటలకు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య రథోత్సవం ప్రారంభమైంది. కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తుడు.. రథోత్సవంపై హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపించారు. వేలాదిమంది భక్తులు.. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఏదీ నాటి శోభ..?

- హీన స్థితిలో భవనాసిని ఆశ్రమం
- ఐదు దశాబ్దాలపాటు నిత్య పూజలు, అన్నదానాలు
- శుభకార్యాలతో సందడే.. సందడి
- వందల్లో పాడిపశువులు
- నేడు అరకొరగా ధూపదీప నైవేద్యాలు
- మాన్యం ఉన్నా.. ఆదాయం శూన్యం

నల్లమాడ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భవనాసిని ఆశ్రమం.. ఇది మండంలోని వంకరకుంట సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉంది. ఈ ఆశ్రమం నల్లమాడకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఆశ్రమ నిర్మాణానికి ముందు ఆ ప్రాంతంలో అవధూత ఎర్రప్పస్వామి సంచరిస్తుండేవారు. ఆధ్యాత్మిక చింతన గల వెంకటరెడ్డిస్వామి ఎర్రప్పస్వామి వద్ద శిష్యరికం పొందారు. గురు బోధనలు ద్వారా ప్రేరేపితుడైన వెంకటరెడ్డిస్వామి 1932లో ఈ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు వివిధ ప్రాంతాల్లో పది ఆశ్రమాలు నిర్మించినట్లు సమాచారం. నాటి నుంచి ఐదు దశాబ్దాల పాటు మునులు, యోగులు, అవధూతలు, ఆధ్యాత్మిక గురువులతో ఆ ఆశ్రమం ఓ వెలుగు వెలిగింది. భవ అనగా పుట్టుక, నాసిని అనగా నశింపచేయునది అని అర్థం. ఈ ఆశ్రమంలో నిత్యం ఆధ్యాత్మిక బోధనలు, ప్రవచనాలు, భగవద్గీతపారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించేవారు. నిత్యం అన్నదానం నిర్వహించేవారు. పలువురు దాతలు ఇక్కడ అన్నదాన సత్రాలు నిర్మించారు. చెదబావులు తవ్వించారు. వివాహాలు, శుభకార్యాలతో ఈ ఆశ్రమం నిత్యం కిటకిటలాడుతూ ఉండేది. రోజుకు ఐదు, ఆరు పెళ్లిళ్లు జరిగేవి. ఎంతోమంది సాధువులకు ఇక్కడ ఆశ్రయం లభించేంది. ఆశ్రమానికి వందల సంఖ్యలో పాడి ఆవులు ఉండేవి. దీంతో పాలు, పెరుగు, వెన్న పుష్కలంగా లభించేది. వంకరకుంట గ్రామ పెద్దలు, ఆశ్రమ నిర్వాహకులు ఆశ్రమం కోసం 18 ఎకరాల మాన్యాన్ని సమకూర్చారు. తద్వారా వచ్చే ఆదాయంతో ఈ ఆశ్రమాన్ని మరింత అభివృద్ధి చేశారు. ఆశ్రమానికి సమీపంలో మల్లమ్మ చెరువు ఉంది. ఈచెరువులో నిత్యం నీరు ఉంటుంది. దీంతో ఈ ఆశ్రమానికి ఎన్నడూ నీటి కొరత ఏర్పడలేదు. వెంకటరెడ్డిస్వామి మరణానంతరం ఆయన శిష్యులు ప్రేమానందస్వామి, స్వరూపానందస్వామి, యోగానందస్వామి, చెన్నమ్మ, రామశివానందస్వామి ఈ ఆశ్రమ నిర్వహణ కొనసాగించారు. ఇలా ఐదు దశాబ్దాల పాటు ఈ ఆశ్రమం దినదినాభివృద్ధి చెందింది.

● నేడు కళాహీనం..

ప్రస్తుతం ఈ ఆశ్రమం నిరాదరణకు గురవుతోంది. పట్టించుకునేవారు లేక నేడు వెలవెలబోతోంది. పాడిపశువులు పదుల సంఖ్యలో కూడా లేవు. మాన్యం భూమి ఉన్నా ఆదాయం శూన్యమైంది. వంకరకుంట గ్రామస్థులు, ఆ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ మూడు సంవత్సరాలుగా ఈ ఆశ్రమ నిర్వాహణ కొనసాగిస్తున్నారు. ఆశ్రమంలో నిర్మించిన కల్యాణమండపాలు, అన్నదాన సత్రాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. పురాతన చేద బావి పూడిపోయింది. ఆశ్రమంలో సాధువులు, సిద్ది పొందేందుకు నిర్మించుకునగర్భదీక్ష గృహం సైతం శిథిలావస్తలోఉంది. ఇక ఇక్కడ శుభకార్యాలు అటుంచి.. కనీసం దీపారాధన చేసేవారు కూడా కరువయ్యారు.



కొండల నడుమ ఏర్పాటు చేసిన భవనాసిని ఆశ్రమం



ఆశ్రమంలోని శివుని మూలవిరాట్

అభివృద్ధి చేస్తాం



భవనాశిని ఆశ్రమం ఒకప్పుడు నిత్య కల్యాణం.. పచ్చతోరణంలా కళకళలాడేది. చాలా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఆదాయం లేక అభివృద్ధికి నోచుకోలేదు. ఆశ్రమానికి 18 ఎకరాలు మాన్యం ఉంది. ఆ భూమిలో కొంత గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డుకు కొంత పోవడంతో నష్టపరిహారం రూ.30 లక్షలు వచ్చింది. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో చర్చించి.. ఆ నిధులతో పాటు మరిన్ని నిధులతో ఆ ఆశ్రమాన్ని అభివృద్ధి చేస్తాం.

-టీడీ కేశవరెడ్డి, వంకరకుంట, ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు

దాతలు సహకరించాలి



ఈ ఆశ్రమానికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నా యి. కాని నేడు ఆదాయం లేక హీన స్థితిలో ఉం ది. నేను ఈ ఆలయంలో మూడేళ్ల నుంచి దీపారాధన చేస్తూ.. పూజలు చేస్తున్నా. కమిటీ పెద్దలు కేశవరెడ్డి, జయంత్‌రెడ్డి సహకారంతో గుడిలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నాను. దాతలు కూడా సహకరిస్తే.. ఆశ్రమానికి పూర్వ వైభవం వచ్చేలా అభివృద్ధి చేయవచ్చు.

- లక్ష్మీనారాయణ, అర్చకుడు



ఆశ్రమం వద్ద ఉన్న కొలను, బావి



శిథిలావస్థకు చేరుకున్న సత్రాలు

ఎస్ బ్రాహ్మణపల్లిలో సమస్యలు పరిష్కరించండి

ముదిగుబ్బ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ బ్రాహ్మణపల్లిలో నెలకొన్న విద్యుత్, రహదారుల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను గ్రామస్థులు కోరారు. ఆదివారం పరిటాల శ్రీరామ్ మదనపల్లి నుంచి ధర్మవరం వెళ్తూ.. మార్గమధ్యంలో ఎస్ బ్రాహ్మణపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఆ గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ స్థంభాలు, విద్యుత్ తీగలు మార్చాలని, లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని, కొన్ని వీధుల్లో కొత్త విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నీటి సమస్యను పరిష్కరించాలని, గాండ్లవారిపల్లి నుంచి ఎస్ బ్రాహ్మణపల్లికి, వలిమిచెర్లోపల్లి నుంచి ఎస్ బ్రాహ్మణపల్లికి లింకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని పరిటాల శ్రీరామ్ ఆ గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, కోట్ల బాబి, వినోద్‌బాబు, సూర్యశేఖర్ రాజు, ఆనంద్, మల్లెల నారాయణస్వామి, సూరి, గణపర్తి ప్రసాద్, నారాయణస్వామి, సుధాకర్, నాయుడు, రంగయ్య, జయప్రకాశ్, శేఖర్, నాగేంద్ర, స్థానిక పార్టీ నాయకులు ఉన్నారు.



ఎస్ బ్రాహ్మణపల్లిలో పర్యటిస్తున్న పరిటాల శ్రీరామ్

పూర్వ విద్యార్థుల సమావేశం

ఓబుళదేవరచెరువు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మస్తాన్ విజ్ఞాన్ పాఠశాలలలో 2003-04లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశయ్యారు. నాటి గురువులు, కరస్పాండెంట్ మస్తాన్, గఫూర్, సుధాకర్, చంద్రమోహన్, బాబాఫిరోజ్, చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించారు.



ఉపాధికి సౌకర్యాలు కరువు

- జాడలేని మెడికల్ కిట్లు, టార్పాలిన్లు
- వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం
- రెండు నెలలుగా అందని వేతనాలు
- పనులకు వెళ్లడానికి జంకుతున్న కూలీలు

ఓబుళదేవరచెరువు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేసే ప్రాంతంలో కూలీలకు ఎలాంటి సౌకర్యాలూ కల్పించడం లేదు. అసలే ఎండకాలం. ఓ పక్క ఎండ తీవ్రతతో వారు ఇబ్బందులు పడుతుంటే.. వారికి కల్పించాల్సిన సౌకర్యాలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లడానికి జంకుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నామమాత్రంగా మెడికల్ కిట్లు, టార్పాలిన్లు అందించి మమ అనిపించింది. ఐదేళ్ల పాలనలో కనీసం ఒక గడ్డపార కూడా ఇచ్చిన పాపాన పోలేదు. గత ప్రభుత్వం కూలీల కష్టాన్ని సామాజిక రూపంలో రూ.కోట్లను ఇతర పనులకు ఉపయోగించుకుని... కూలీలకు అన్యాయం చేసింది. అమడగూరు మండలంలో 5,713 జాబ్‌కార్డులకుగాను 10,495 మంది కూలీలు పనులు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం,318 మంది, ఓబులదేవరచెరువు మండలంలో 8,833 కార్డులకుగాను 1,625 మంది కూలీలు పనిచేయాల్సి ఉండగా 784 మంది, నల్లమాడ మండలంలో 8,230 జాబ్‌కార్డులకు గాను 14,431మంది కూలీలు పని చేయాల్సి ఉండగా.. 1,241 మంది ప్రస్తుతం పనులు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రధానంగా ఎండ ఎక్కువగా ఉండడంతో టార్పాలిన్లు, మెడికల్ కిట్లు, గడ్డపార్లు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కూలీలు కోరుతున్నారు.

● జాడలేని మెడికల్‌కిట్లు, టార్పాలిన్లు

ఎండకాలంలో ఉపాది కూలీల పని చేసే ప్రదేశంలో నీడ కోసం టార్పాలిన్లు ఏర్పాటు చేయాలి. వీటికి తోడు పనిచేసే సమయంలో పొరపాటు గడ్డపార్ల తగిలితే ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. గత వైసీపీ ప్రభుత్వం ఈ సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. ఐదేళ్ల పాలనలో అరకొరగా టార్పాలిన్లు, మెడికల్ కిట్లు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. నిబంధనల ప్రకారం ఒక్కొక్క శ్రమశక్తి సంఘానికి ఒక టార్పాలిన్, మెడికల్ కిట్టు ఇవ్వాల్సిఉంది. వైసీపీ ప్రభుత్వం సంఘాలను మరచి, పంచాయతీకి ఒకటి, రెండు కిట్లు, టార్పిలిన్లు పంపిణీ చేసింది.

● ఊసేలేని గడ్డపార్లు: గత వైసీపీ పాలలో గడ్డపార్ల ఊసేలేదు దీంతో కూలీలు వారే సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని గడ్డపారల్లు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. నింబంధనల మేరకు 20 మంది కూలీలకు కలిసి ఒక శ్రమశక్తి సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటే నాలుగు గడ్డపార్లతోపాటు, ఒక మెడికల్ కిట్టు, ఒక టార్పాలిన్ ఇవ్వాలి. వైసీపీ ప్రభుత్వం ఏకంగా ఆ సంఘాలనే ఎత్తివేసింది.

● అందని వేతనాలు: ఉపాధి కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కష్టపడినా ఫలితం లేకపోవడంతో కుటుంబాలను ఎలా షోషించాలని కూలీలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వేతనాలను చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.



మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పనిదినాలు పెంచాలి



కరువు మండలాలో కేంద్రం అదనంగా 50 రోజల పనిదినాలు కల్పిస్తోంది. అలాగే తమ మండలాల్లో అదనంగా 50రోజుల పనిదినాలు కల్పించాలి. వందరోజులు పూర్తి అయిన కూలీలు పనులు లేక వలసలు పోయే ప్రమాదముంది. వారికి అదనంగా పనుల కల్పించి ఆదుకోవాలి.

-వెంకటేష్, కూలీ, మారెవాండ్లపల్లి

సౌకర్యాలు కల్పించాలి



ఎండలు మండుతున్నాయి. పనులకు వెళ్లాలంటే భయంగా ఉంది. నీడ కోసం టార్పాలిన్లు అందించాల్సి ఉంది. గడ్డపార, మెడికల్ కిట్లు కూడా పంపిణీ చేసి యేళ్లు గడుస్తోంది. కూటమి ప్రభుత్వం స్పందించి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి.

-చిన్నబాబు, వీరఓబునపల్లి

నాటుసారా విక్రేత అరెస్టు

బత్తలపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి వద్ద నాటుసారాను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి.. కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించినట్లు ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ చంద్రమణి ఆదివారం తెలిపారు. నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా చెర్లోపల్లి గ్రామంలో ఈ దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో ఎస్‌ఐ చాంద్‌బాషా, సిబ్బంది ఓబిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సునీత, చంద్ర, రఘురామ్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

కొత్తచెరువు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మండలం జగరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గోపాల్ స్థానిక ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 లో పదో తరగతి చదివాడు. రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో అతను మరణించాడు. విషయం తెలుసుకున్న తోటి.. విద్యార్థులు ఆదివారం గోపాల్‌కు సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేకరించిన రూ. లక్షను గోపాల్ భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కర్‌నాయుడు, రోశయ్య, విజయ్‌కుమార్, పండరీనాథ్, రియాజ్, వెంకటరాముడు, పణీంద్ర, భాస్కర్, నాయుడు, రవి పాల్గొన్నారు.

టీచర్లకు ఆంగ్ల బోధనపై ఆన్‌లైన్ శిక్షణ



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న రాజేశ్వరగౌడ్

కొత్తచెరువు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలోని అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులకూ ఆంగ్లంలో బోధనపై 40 రోజుల పాటు త్వరలో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామని విల్ టూ సెమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్ రాజేశ్వరగౌడ్ తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు దీనిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్పష్టంగా ఇంగ్లీషు మాట్లాడే విధంగా చేయడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఉపాధ్యాయులకు ఆంగ్లబోధన ఏ విధంగా చేయాలనే దానిపై ఆన్‌లైన్ క్లాసుల్లో వివరిస్తామన్నారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలో 53 వేల మంది ఉపాధ్యాయులకు ఈ శిక్షణ తరగతులను నిర్వహించామన్నారు. ఈ రాష్ట్రంలో మొదటి విడత కింద విశాఖపట్నం, అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేశామన్నారు. రెండో విడతలో భాగంగా ఉమ్మడి అనంత జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులు 2500 మందికి ఆన్‌లైన్ క్లాసులను 40 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు.

పోతలయ్య, చెన్నకేశవ ఉత్సవాలు ప్రారంభం

పుట్టపర్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దకమ్మవారిపల్లిలో ఆదివారం పోతలయ్య, చెన్నకేశవ, బంగారు లింగమయ్యస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన ఆదివారం సాయంత్రం పోతలయ్యకు యలవగంప పూజలు నిర్వహించారు. ఉరుములు, తప్పెట్ల తోటలోకి వెళ్లి పూజలు నిర్వహించి యలవగంపను తీసుకువచ్చారు. స్థానిక చింత తోపులోని ఆలయంలో యలవగంప స్వామికి సమర్పించి పూజలు చేశారు. సోమవారం దాసంగాల మడుగులో పూజలు, సాయంత్రం ఎద్దులబండ్ల పోటీలు నిర్వహిస్తారు. ఎద్దులబండ్ల పోటీలలో పాల్గొనడానికి ఇతర ప్రాంతాలకు చెందిన ఎద్లు పుట్టపర్తికి చేరుకున్నాయి.

న్యూస్ బాక్స్

6లోగా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

గోరంట్ల, మార్చి2(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సొంత స్థలముండి ప్రభుత్వ ఇళ్లు కావలసిన లబ్ధిదారులు ఈనెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ఎఇ గణేష్ ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత సచివాలయం, లేదా మండలంలోని గృహ నిర్మాణ కార్యాలయంలో అందించాలన్నారు. లబ్ధిదారులు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను సచివాలయాల్లో పొందాలన్నారు. సొంత స్థలం పట్టా లేదా పొసెషన్ సర్టిఫికెట్ కోసం మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో ప్రభుత్వ ఇల్లు మంజూరైనవారు ఇందుకు అనర్హులన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిల్లు కార్మికులను ఆదుకోండి

పెనుకొండ, మార్చి2(ఆంధ్రజ్యోతి): కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలో ఉన్న ప్రీకాట్-బీ స్పిన్నింగ్మిల్లులో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికులు మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. ఆదివారం మంత్రిని కలిసిన సీఐటీయు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి జీఎస్ వెంకటేశ్, రైతు సంఘం ఉపాధ్యక్షులు హరి, కార్మికులు మంత్రికి వినతిని అందిస్తూ కొడిగెనహళ్లిలోని ప్రీకాట్-బి మిల్లు స్థాపించి 42ఏళ్లు అయిందన్నారు. ఈ సంస్థను యాజమాన్యం ఉన్నపళంగా మూసివేసే ప్రయత్నాలు చేస్తోందన్నారు. సంస్థను మూసివేస్తే అందులో పనిచేస్తున్న దాదాపు 500మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారన్నారు. ఇలా జరగకుండా చర్యలు తీసుకుని కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బాబావలి, వర్కర్స్ యూనియన్ నాయకులు నాగిరెడ్డి, నాగభూషణ, గోపాలప్ప, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం పట్ల అవగాహన

పరిగి, మార్చి2(ఆంధ్రజ్యోతి):యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉత్తమ విద్యనభ్యసించి భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాలని ఎస్ఐ రంగడు యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఆదివారం భగత్సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైబర్క్రైం టీమ్మెంబర్ వేణుగోపాల్, డా.తారకనాథ్, డీఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు


కత్తెర పురుగు నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు

పెనుకొండ రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రబీసీజన్లో మొక్కజొన్న విరివిగా సాగుచేశారు. మొక్కజొన్న సాగు చేసిన నెలవ్యవధిలోనే పంటకు కత్తెర పురుగు ఆశించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి


బీఎస్ మూర్తి (ఫైల్)

హిందూపురం,మార్చి2(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని ధర్మపురంలో నివాసముంటున్న మాజీ కౌన్సిలర్ బీఎస్ మూర్తి (64)అనారోగ్యంతో మృతిచెందారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటాక మృతిచెందారు. ఆయన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో కౌన్సిలరుగా గెలుపొందాడు. అదేవిధంగా ఆయన వాల్మీకి సంఘం కోశాధికారిగా కొన్నేళ్లపాటు పనిచేశారు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. కాగా అనంతపురం ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్చేసి పరామర్శించారు. ఎంపీ కుమారుడు విక్షిత్ మూర్తి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్పార్టీ, బీజేపీ, వాల్మీకి సంఘం నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పాఠశాలకు ఆర్ఓ ప్లాంట్ వితరణ


ఆర్ఓ ప్లాంట్వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం మలుగూరు గురుకుల పాఠశాలకు ముత్తూట్ ఫైనాన్స్ వారు ఆర్ఓ ప్లాంట్ను వితరణ చేశారు. పెనుకొండకు చెందిన సాహితీ గగన్మహల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, న్యాయవాదిప్రతాప్రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఓ ప్లాంట్ను పాఠశాల అధ్యాపకులకు అందజేశారు. వెయ్యి లీటర్ల సామర్థ్యం గల దీంతో విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించవచ్చని ప్రిన్సిపాల్ సుజాత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎన్ స్వామి, ముత్తూట్ఫైనాన్స్మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీలను శుభ్రం చేయండి

గుడిబండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరగల్లు గ్రామంలో ఉన్న మురికి కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరారు. మురికి కాలువలు మూసుకుపోయి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు.

రోడ్డుపైకి ఎలుగుబంటి



రాయదుర్గం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని రాజీవ్గాంధీ కాలనీ వద్ద రోడ్డుపై రెండ్రోజులుగా ఎలుగుబంటి హల్చల్ చేస్తోంది. శనివారం రాత్రి ద్విచక్రవాహనదారులకు ఎలుగుబంటి కనిపించడంతో భయాందోళన చెందారు. సమీపంలో వున్న కురాకుల గుట్ట నుంచి వచ్చి రోడ్డు మీద సంచరిస్తున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఆదివారం పగలే రోడ్డుపైకి రావడంతో పరిసర ప్రాంత ప్రజలు పరుగులు పెట్టారు. అరగంటపాటు రోడ్డుపై సంచరించిన ఎలుగుబంటి తర్వాత గుట్టల్లోకి వెళ్లిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు కొండ ప్రాంతాన్ని పరిశీలించి, కాలనీ వాసులకు పలు సూచనలు ఇచ్చారు.

పెడదారి పడుతున్న బాల్యం


● మత్తులో జోగుతున్న విద్యార్థులు
● లేపాక్షిలో మద్యంతో పట్టుబడిన వైనం
● తల్లిదండ్రుల మాట వినని పిల్లలు



హిందూపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల చాటున ఆడుకోవాల్సిన బాలలు పక్కదారి పట్టి పెడదారిలో పయనిస్తున్నారు. నేరమంటే ఏమిటో తెలియని వయసులోనే నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కి కటకటాలపాలవుతున్నారు. స్నేహితుల ద్వారా మత్తుపదార్థాలకు అలవాటుపడి దాని ప్రభావంతో బాల్యంలోనే నేరస్తులుగా మారుతున్నారు. ఓప్రైవేట్ సంస్థ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో నెలకు 200మందిదాకా మైనర్లే వివిధ నేరాల్లో అరెస్ట్ అవుతున్నారని తేల్చింది. ఇటీవల వెలుగు చూస్తున్న సంఘటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.

తూముకుంట పారిశ్రామికవాడ ప్రాంతంలో పోలీసులు సాయంత్రం వేళలో ముళ్లపొదల చాటున పేకాటరాయళ్లను గాలిస్తుండగా ఐదుగురు పిల్లలు పట్టుబడ్డారు. వీరంతా ఇంకా 10వ తరగతిలోపు చదువుతున్నవారే. అక్కడ వారు కర్ణాటక నుంచి మద్యం తీసుకొచ్చి సేవిస్తున్నారు. వారిని విచారిస్తే గతేడాది హిందూపురం, కొటిపి రహదారి పక్కన ఓ ఆటోడ్రైవర్ను హత్యచేసినవారి వివరాలు బయటపడ్డాయి.

నెలక్రితం పట్టణ శివారు ప్రాంతంలో పోలీసులు గస్తీ తిరుగుతుండగా ఓ కళాశాల సమీపంలో ఆరుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. వీరు కళాశాలకు డుమ్మాకొట్టి మద్యం సేవిస్తున్నారు. వీరిని పోలీసులు మందలించి వదిలేశారు. రెండ్రోజుల క్రితం లేపాక్షిలో జరిగిన బ్రహ్మోత్సవాల సందర్భంగా రాత్రిపూట ఓ గదిలో నుంచి కేకలు వస్తుండడం గమనించిన పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా 13 మంది పిల్లలు పట్టుబడ్డారు. వీరు మద్యంతోపాటు మత్తు వచ్చేందుకు ఉపయోగించే గుట్కాలోని పౌడర్ను సిగరెట్లోకి వేసుకుని పీల్చుతుండటం గమనించారు. వీరి వివరాలను ఆరాతీయగా వారి లో పదిమంది దాకా విద్యార్థులే ఉన్నారు.



మత్తులో జోగుతూ..

హిందూపురం పట్టణంలోని పలు కళాశాలలకు వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ఇందులో రోజూ వచ్చిపోయే విద్యార్థులలో పది శాతం మంది రోజూ కళాశాలకు డుమ్మా కొడుతుంటారు. వీరిలో ఎక్కువమంది విద్యార్థులు మత్తుకు అలవాటుపడ్డవారేనని పోలీసులు అటు కళాశాల యాజమాన్యం పేర్కొనడం ఆందోళన కలిగించే అంశం. ఎందుకంటే విద్యార్థి దశలో మత్తుకు అలవాటుపడితే ఆ మత్తులో ఏ నేరానికి ఒడిగడతారోనని గురువుల భయం. రెండు నెలల క్రితం ఓ కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై అధ్యాపకులు నిఘా ఉంచారు. వారు రోజూ కళాశాల ఎగ్గొట్టి ఇష్టమొచ్చినపుడు వస్తూ మత్తులో ఉండటాన్ని గమనించి వారికి టీసీలు ఇచ్చి పంపించేశారు. పట్టణ పరిధిలోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మత్తుకు అలవాటుపడ్డాడు. పాఠశాలకు వచ్చి విద్యార్థులతో గొడవకు దిగుతుండటంతో తల్లిదండ్రులను పిలిపించి ఆ విద్యార్థిని పంపించేశారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతూనే ఉన్నాయని ఉపాధ్యాయులు పేర్కొనడం ఆందోళన కలిగించే అంశం.

ఒకప్పుడు తల్లిదండ్రులంటే పిల్లలకు భయం ఉండేది. కుమారుడికి పెళ్లీడు వచ్చినా లేక పెళ్లైనవారుకూడా తల్లిదండ్రులకు భయపడేవారు. ప్రస్తుతం వారికి తల్లిదండ్రులు, గురువులు అంటే భయం లేకుండా పోయింది. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ఫోన్ ఉండటంతో అందులో వచ్చే మంచి సమాచారం కాకుండా చెడును స్వీకరించి విద్యార్థులు తల్లిదండ్రులపై తిరగబడుతున్నారు.

బాగుపడే దారి లేదా?

కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను గారాబంగా పెంచడం, వారు అడిగిందల్లా ఇవ్వడంతో అదే అలుసుగా తీసుకుని పిల్లలు మత్తులో జోగుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా హాజరు ఉంటే చాలు ప్రభుత్వం అప్పనంగా ఉచితాలిస్తే వారికి బాధ్యత ఎందుకుంటుంది? ఏదో రకంగా హాజరువేయించుకుని ఇలాంటి తిరుగుళ్లకు అలవాటుపడరన్న గ్యారెంటీ ఏముంది? ఇప్పటికైనా తల్లిదండ్రులు బాల్యం నుంచే తమ బిడ్డల పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది.

వన్యప్రాణులతో పంటలకు నష్టం


జింకల దాడిలో దెబ్బతిన్న వేరుశనగ పంట

చిలమత్తూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సాగుచేసిన పంటలను కాపాడుకోవడం రైతులకు తలనొప్పిగా మారింది. ఒక పక్క చీడపీడలతో పాటు, వాతావరణ పరిస్థితులు ప్రతిబంధకం కాగా, మరో పక్క వన్యప్రాణులతో తీవ్రనష్టానికి గురవుతున్నారు. ఇటీవల మండలంలో జింకలు, నెమళ్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దాంతో అవి పచ్చని పంటలపై పడుతూ రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ప్రధానంగా రబీలో అక్కడక్కడ సాగుచేస్తున్న వేరుశన పంటలు, రాగి, వరి, మిరప వంటి పంటలకు వీటితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాగలేరు, పలగలపల్లి, మొరసలపల్లి పంచాయతీల్లో వీటి బెడద తీవ్రంగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. వేరుశనగ పంటలో జింకలు గుంపులు గుంపులుగా చొరబడి కాళ్లతో వేరుశనగ మొక్కలను కదిలించి వాటికి ఉన్న ఊడలను మేసేస్తున్నట్లు వాపోతున్నారు. మిరపలో అయితే నెమళ్లు కాయలను ఏరుకొని తినేస్తున్నాయంటున్నారు. అదేవిధంగా రాగిపంటలో కంకులను కొరికి తింటున్నాయని తెలిపారు. నెమళ్లు కూడా 20 నుంచి 30 వరకు గుంపులు గుంపులుగా వచ్చి పంటలపై దాడిచేస్తున్నాయని అంటున్నారు. చేతికొచ్చిన పంటలను ఇంటి దాకా తీసుకెళ్లడం కష్టంగా ఉందని, వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకోవడం కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. అధికారులు కలుగజేసుకొని వాటి నుంచి పంటలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

40 మందితో ఒక్కసారిగా ఈకేవైసీ


బెంగళూరుకు వెళ్లి వలస కూలీలతో ఈకేవైసీ చేయించిన డీలర్ నరసింహులు

మడకశిర రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ పీ షాపుల ద్వారా కార్డుల లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో రేషన్ కార్డులో ఉన్న కుటుంబసభ్యులు అందరితోను ఈకేవైసీ ఫిబ్రవరి 28 తేదిలోపు చేయించుకోవాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో డీలర్లు అందుబాటులో ఉన్న వారి అందరితో ఈకేవైసీ వేయించారు. మడకశిర ప్రాంతంలో చాల మంది పొట్టకూటికోసం బెంగళూరుకు వలస వెళ్లారు. ప్రతి నెల కుటుంబ సభ్యులలో ఒకరు వచ్చి కార్డులకు బియ్యం తీసుకువెళుతుండేవారు. రేషన్ కార్డులోని సభ్యులు అందరూ కలసి తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సిఉండగా, వారు అందరూ బెంగళూరు నుంచి రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకరు వస్తే ఒకరురారు. దీంతో మండలంలోని ఎల్లోటి డీలరు నరసింహులు వారి ఎఫ్పీ షాపు పరిధిలో వలస వెళ్లిన కూలీలను గుర్తించి వారికి ఇబ్బందులు లేకుండా ఆదివారం ఆయనే బెంగళూరుకు వెళ్లి 40 మందితో ఒక్కసారిగా ఈకేవైసీ పూర్తి చేయించారు.

రోడ్లపై పశువుల సంచారం


ఎన్టీఆర్ సర్కిల్లో రోడ్లపై సంచరిస్తున్న పశువులు

పెనుకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీలో పలు ప్రాంతాల్లో రహదారులు, జాతీయ రహదారులపై పశువులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని వైజంక్షన్, పోలీస్ స్టేషన్, పెట్రోల్బంక్, ఆర్టీసీ బస్టాండు, దర్గాసర్కిల్, అంబేద్కర్, ఎన్టీఆర్ సర్కిల్, మడకశిర రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రతిరోజూ పశువులు రోడ్లపై పడుకుని ఉండటం, సంచరిస్తుంటాయి. దీనికారణంగా రోడ్లపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక మార్లు, ప్రమాదాలకు గురై గాయాలపాలై ఆసుపత్రిపాలవుతున్నారు. మడకశిర రోడ్డులో ఇటీవల ద్విచక్రవాహనానికి పశువులు అడ్డురావడంతో వాహనం బోల్తాపడి మహిళ మృతిచెందింది. రోడ్లపై పశువులు పడుకుంది గమనించి వాటిని ఢీకొట్టిన సంఘటనలో అనేక పశువులుకూడా చనిపోయాయి. పట్టణంలోని పశువుల యజమానులు తమ పశువులను బయటికి వదలడటంతో అవి రోడ్లపై సంచరిస్తూ చెత్తాచెదారం తిని అక్కడే పడుకోవడంతో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. యజమానులు తమ పశువులను తమ పశువుల కొట్టాల్లోనే కట్టేయాలని రోడ్లపై వదలకుండా నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యజమానులకు నోటీసులు: సతీష్కుమార్, కమిషనర్,

పశువుల సమస్య మా దృష్టికి వచ్చింది. పశువులను రోడ్లపై వదలరాదని యజమానులకు నోటీసులు జారీచేశాం. వారు స్పందించకపోతే రోడ్లపైకి వచ్చే పశువులను వేలం వేస్తాం. యజమానులపై చర్యలు తీసుకుంటాం.

200 మందికి చికిత్స

గుడిబండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుడిబండ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ సాయికృష్ణ తండ్రి వీరనారాయణ జ్ఞాపకార్థం మండలంలోని జవనడుకు, మోపురుగుండు, గుడిబండ గ్రామాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సృజన, మొక్షిత, శ్రీరామిరెడ్డి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

మడకశిరటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రాజ్యాంగాన్ని అనుసరిస్తూ రాగద్వేషాలకు అతీతంగా పనిచేయాల్సి ఉన్నా వైసీపీ పార్టీ నాయకులకు పథకాల్లో భాగస్వాములు చేయవద్దని అనడం ఎంతవరకు న్యాయం అని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీలో కూడా పేదవారు ఉన్నారని, అర్హులైన పేదలందరికీ పథకాలు అందించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు న్యాయం అన్నారు.

జూన్ 30 వరకు అదనపు లోడు క్రమబద్ధీకరణ

చిలమత్తూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల ట్రాన్స్కో ఎఈ జయవర్ధన్రెడ్డి పేర్కొన్నారు. ప్రధానంగా గృహ అవసరాలకు విద్యుత్ కనక్షన్ ఇచ్చే సమయంలో వాడే దీపాలు, గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడులను కిలోవాట్లలో లెక్కిస్తారన్నారు. ఆమేరకు డెవలప్మెంట్ చార్జీలు. సెక్యూరిటి డిపాజిట్ వసూలు చేస్తారన్నారు. ఉదాహరణకు కిలో వాట్ లోడ్తో కనెక్షన్ తీసుకుంటే డెవలప్మెంట్ చార్జీస్ రూ. 2 వేలతో పాటు సెక్యూరిటి డిపాజిట్ రూ. 200లు చెల్లించాలి. అదే రెండు కిలోవాట్లకు డెవలప్మెంట్ చార్జీస్ రూ. 4వేలు చెల్లించాలి. ప్రస్తుతం పెరిగిన విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామ, మండల కేంద్రంలో కొత్త కనెక్షన్లకు కనీసం రెండు కిలోవాట్లుకు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్ వినియోగం ఎక్కువ ఉన్న వాళ్లు తక్కువ లోడుకి అనుమతి తీసుకోవడంతో లోఓల్టేజ్ సమస్యతో పాటు అధికారుల తనిఖీల్లో దొరికితే జరిమానాలు విధించే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక కిలోవాట్ కంటే అధిక విద్యుత్ వినియోగం జరుగుతున్నట్లైతే వెంటనే ప్రభుత్వం కల్పించిన విధంగా 50 శాతం రాయితీని ఉపయోగించుకొని అదనపు లోడుని క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణకు మార్చి 1 వ తేదీ నుంచి జూన్ 30 వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు.

వైభవంగా సిద్దేశ్వరస్వామి చిన్న రథోత్సవం

అమరాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో ఆదివారం 3 గంటలకు శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామి దేవాలయం నుండి శ్రీహంపన్నస్వామి దేవాలయం వరకు భక్తుల కోలాహలం మధ్య రథాన్ని లాగారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు హెంజేరు సిద్దేశ్వరస్వామి దేవాలయం వరకు రథాన్ని తీసుకెళ్లారు. భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఉపవాసం ఆచరించి రథానికి అరటిపండ్లు, బొరుగులు, కొబ్బరికాయ తదితర వాటిని సమర్పించి తమ మొక్కుబడులను తీర్చుకొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ఈఓ నరసింహరాజు, చైర్మన్ కరేగౌడ్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, పంచాయతీ కన్వీనర్ తిప్పజ్జ, ఎంపీటీసీ ఓంకార్స్వామి, గొల్లమారనపల్లి రామచంద్రప్ప పాల్గొన్నారు.

టీడీపీలోకి వచ్చే వలసలను చేతనైతే ఆపండి

- వైసీపీకి మంత్రి సవాల్


టీడీపీలోకి సరోజ నాగేనాయక్ను స్వాగతిస్తున్న మంత్రి సవిత

పెనుకొండటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది నెలల అభివృద్ధి చూసి టీడీపీలోకి వస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలను చేతనైతే ఆపాలని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఛాలెంజ్ చేశారు. ఆదివారం గోరంట్ల మేజర్పంచాయతీలో వైసీపీ సానుభూతి సర్పంచ్ సరోజ నాగేనాయక్ మరో 200మందితో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి మంత్రి సవిత కండువావేసి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేస్తూ వైసీపీ నుంచి వచ్చే వారిని సాదరంగా స్వాగతంపలుకుతున్నారన్నారు. ఎన్డీఏ కూటమిపై నమ్మకంతో వచ్చే వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటారన్నారు. ఐదేళ్లపాలనలో రాష్ట్రం అధోగతైందని అందుకే వైసీపీకి 11తో సరిపెట్టారని కొనియాడారు. ఎనిమిది నెలల్లో గోరంట్ల మండలంలో కోట్లాదిరూపాయల అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గోరంట్ల మండలం మలసముద్రం పంచాయతీ నుంచి 12మంది మంత్రి సవిత స్వగృహంలో టీడీపీలో చేరారు.

సీఎం రిలీఫ్ఫండ్ చెక్కు పంపిణీ

పరిగి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జంగాలపల్లికి చెందిన గంగమ్మ అనే మహిళకు సీఎం సహాయనిధి నుంచి రూ.28,200 చెక్కును బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదివారం అందజేశారు. కొద్దినెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మంచానికే పరిమితమైన గంగమ్మ సీఎం రిలీఫ్ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం సహాయం మంజూరు చేసింది. చెక్కును అందుకున్న బాధితురాలు కూటమి ప్రభుత్వానికి, మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మారుతి ప్రసాద్, డీఎన్ ప్రవీణ్రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై మెరుపుదాడి

● 17మంది జూదరుల అరెస్ట్
● రూ.91వేలు, ద్విచక్రవాహనాలు స్వాధీనం

హిందూపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : సినీఫక్కీలో పేకాట స్థావరంపై హిందూపురం అప్గ్రేడ్ పోలీసులు మెరుపుదాడి చేశారు. అప్గ్రేడ్ సీఐ ఆంజనేయులు ఆదివారం తన సిబ్బందితో పేకాటరాయుళ్లకు అనుమానం రాకుండా ఐచర్ వాహనంలో పేకాటస్థావరం వద్దకు వెళ్లారు. హిందూపురం, సోమందేపల్లి మండలం సరిహద్దులోని పత్తికుంటపల్లి, చెర్లోపల్లి మధ్య కొండప్రాంతంలో ఆ స్థావరాన్ని పోలీసులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. దాడిలో అక్కడ జూదమాడుతున్న 17మందిని అదుపులో తీసుకున్నారు. వారి నుంచి రూ.91వేలు నగదు, పది ద్విచక్రవాహనాలు, సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే అప్పటికే పేకాటరాయుళ్ల ఇన్ఫార్మర్లుగా కొండపై కొంతమందిని పెట్టుకున్నారని, వారు పేకాటరాయుళ్లకు ఫోన్చేసి ఐచర్వాహనంలో పోలీసులు వచ్చారని సమాచారం ఇవ్వడంతో కొంతమంది పారిపోయినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ద్విచక్రవాహనం

పెనుకొండ టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): హిందూపురం వెళ్లేందుకు వచ్చిన ఆర్టీసీ బస్సును ముందు భాగంలో ఢీకొని ద్విచక్రవాహనదారుడు రామాంజినేయులు గాయాలపాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. అటువైపు వెళ్తున్న మంత్రి సవిత స్పందించి అతడిని తన ఎస్కార్ట్వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. రోడ్డు ప్రమాదంపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గోరంట్ల, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుట్టపర్తి ప్రధాన రహదారిలో గుమ్మయ్యగారిపల్లి సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొన్నసంఘటనలో ఇద్దరు వ్యక్తులు ఆదివారం తీవ్రంగా గాయపడ్డారు. గుత్తివారిపల్లికి చెందిన ఈశ్వర్ అక్కను చూడడానికి ఆదివారం ఖజాపురం వచ్చారు. వరి పొలానికి ఎరువులు వేయాల్సి ఉండడంతో ఎరువు కొనుగోలు చేయడానికి అక్కడ నుంచి గోరంట్లకు బయలుదేరి వెళ్లారు. ఈశ్వర్ తనతోపాటు అక్క పెద్దకుమారుడైన, 9వతరగతి చదువుతున్న రాజును సహాయంగా ద్విచక్రవాహనంపై తీసుకెళ్లారు. గోరంట్లలో కాంపెక్సు ఎరువుల బస్తా తీసుకుని ద్విచక్రవాహనంపై ఇరువురు ఖజాపురం తిరిగి వస్తుండగా, గుమ్మయ్యగారిపల్లి సమీపంలో బెంగుళూరు వైపు వెళ్తున్న కారు వారిని ఢీకొంది. ఈప్రమాదంలో ఇరువురికి గాయాలుకాగా, ఈశ్వర్ తీవ్రంగా గాయపడడంతో 108లో పుట్టపర్తికి తీసుకెళ్లారు.

కబ్జాదారుల అరెస్ట్

హిందూపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : హిందూపురం మండలంలో కొన్నిచోట్ల భూకబ్జాలకు పాల్పడుతున్న కబ్జాదారుల ముఠాను అప్గ్రేడ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన అరెస్ట్ వివరాలను సీఐ ఆంజనేయులు వెల్లడించారు. సంతేబిదునూరుకు చెందిన శివయ్య, వీడిరోడ్డుకు చెందిన భరత్, గాంధీనగర్కు చెందిన ఫైరోజ్ఖాన్లు ముఠాగా ఏర్పడి కొన్నిచోట్ల భూముల రికార్డులు తారుమారుచేశారు. కిరికెర గ్రామ పరిధిలో సర్వేనంబరు 243-2లో ప్లాట్ నంబరు 91ని కబ్జాచేయాలనే ఉద్దేశ్యంతో తప్పుడు పత్రాలు సృష్టించారు. అంతేకాకుండా ఆధార్కార్డుకూడా సృష్టించి ప్లాటును వారి పేరుమీద అగ్రిమెంట్ చేయించుకున్నారు. అయితే ఆ స్థల యజమాని అయిన ముద్దిరెడ్డిపల్లికి చెందిన సువర్ణమ్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టి కేసు నమోదు చేసిన పోలీసులు పై ముగ్గురిని విచారించి నేరం రుజువుకావడంతో అరెస్టుచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భూములు, ప్లాట్లు అక్రమాలకు పాల్పడే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కబ్జాలకు పాల్పడేవారు ఎంతటివారైనా చట్టంప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి


అర్జీలు స్వీకరిస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకులు

మడకశిరటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ఉదయం జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్యలు పిలుపు నిచ్చారు. నగర పంచాయతీ పరిధిలోని చౌటిపల్లిలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో సూపర్సిక్స్లో భాగంగా గ్రామాల్లో మూడుసెంట్లు, పట్టణంలో రెండు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, తదితర హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. పట్టణంలోని కాలనీల్లో పర్యటించి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈసమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం కార్యదర్శి ఆర్.జి.పవిత్ర, సీపీఐ నాయకులు రామాంజనేయులు, నాగేంద్ర, ప్రమీళ, అక్కమ్మ, ధనుంజయ, తదితరులు ఉన్నారు.